# నారికీ నారికీ నడుమ



*ఏకస్మిన్ శయనే సరోరుహ దృశోర్విజ్ఞాయ నిద్రాంతయో*
*రేకాం పల్లవితావగుంఠనవటావుత్కంధరో దృష్టవాన్*
*అన్యస్యాః సవిధం సమేత్య విభృతం క్యాలోల హస్తాంగులీం*
*వ్యాపారైర్వసనాంచలం చపలయన్ స్వాపచ్చుతిం క్షప్తవాన్*

***భావం:*** ఒకే మంచం మీదే ప్రియభార్యలు ఇద్దరూ నిద్రపోతున్నారని తెలుసుకుని మెడ చాపి ఒకతె దుప్పటి కప్పుకుని ఉన్నదని చూసి రెండవ ఆమె దగ్గరకు నిశ్శబ్దంగా వచ్చి చేతివేళ్ళతో ఆమె చీరను కదిలించి నిద్ర లేపాడు.

వీరమల్లుడు మహావీరుడు. అనేక యుద్ధాలలో పాల్గొని మహారాజు విజయానికి కారణమయ్యాడు. వీరమల్లుడు మహావీరుడే కాదు, అందగాడు

కూడా. ఎందరో కన్యలు అతణ్ని వలచారు. వారిలో కళా, ఇళా అనే అమ్మాయిలను అతను వివాహం చేసుకున్నాడు. నీతి మంతుడైన వీరమల్లుడు ఇద్దరు భార్యలనూ సమంగా చూసుకునేవాడు. నగలూ, చీరలూ, పరిచారికలూ అన్నీ ఇద్దరికీ సమంగా లభించేవి. ఒక వీరుడు వీరమల్లుడున్న దేశానికి వచ్చి తనతో ఎవరైనా పోరాడి ఓడించగలరా అని పందెం వేశాడు.

కొంతమంది భయంతో ప్రయత్నించలేదు. మరికొందరు ప్రయత్నించి విఫలమయ్యారు. చివరకు వీరమల్లుడు పోరాడి గెలిచాడు. ఓడిపోయిన వీరుడు అవమానంతో కుంగిపోయి, వీరమల్లుడికి నమస్కరించాడు. దేశం పరువు నిలబెట్టినందుకు మహారాజు మెచ్చుకుని కెంపుల హారాన్ని బహూకరించాడు. వీరమల్లుడు గర్వంతో పొంగిపోయాడు.

ఇంటికి తిరిగివస్తున్న వీరమల్లుడికి మనస్సులో ఆనందం స్థానాన్ని ఆందోళనా, గర్వం స్థానాన్ని భయమూ ఆక్రమించాయి. హారం ఏ భార్య కివ్వాలి? ఇంతకాలం అన్నీ ఇద్దరికీ సమంగా ఇస్తున్నాడు. ఇంకొక హారం చేయించవచ్చును కానీ దానిపై మహారాజముద్ర ఉండదు కదా. అప్పటికే వార్త ఇంటికి చేరింది. కళా, ఇళా భర్తకు స్వాగతం చెప్పారు. ఇద్దరూ హారం తమకే ఇస్తాడనుకుంటూండగా వీరమల్లుడు " నా చెల్లికి ఇంతవరకు ఏమీ ఇవ్వలేదు. ఆమెకు ఈ హారం ఇచ్చి వస్తాను" అని చెల్లెలింటికి వెళ్ళాడు. హారం దక్కనందుకు కళా, ఇళా ఇద్దరూ అలిగారు. తమ పడక గదులలోకి కూడా వెళ్ళకుండా వాకిట్లో అతిథులకు వేసిన మంచం మీద పడుకుని నిద్రపోయారు. వీరమల్లుడు తిరిగి వచ్చి ఒకే మంచం మీద నిద్రపోతున్న భార్యలను చూశాడు. ఇద్దరూ అలిగినవిషయం తెలిసింది. ఒకరి తర్వాత ఒకరి అలక తీర్చాలి. మంచం దగ్గరగా వెళ్ళి మెడ చాపి చూశాడు. చీకటిలో సరిగా కనిపించలేదు. కానీ ఒకామె దుప్పటి ముసుగెట్టుకుని పడుకుని ఉంది. హమ్మయ్య అనుకుని రెండవ ఆమె దగ్గరకు నిశ్శబ్దంగా వచ్చి చేతివేళ్ళతో ఆమె చీరను కదిలించి నిద్రలేపాడు. ఇద్దరు ముద్దుగుమ్మల మగడి పాట్లివి పాపం.

******